క్లుప్తంగా

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కొదురుపాక బ్రిడ్జి వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న బండి సంజయ్

బోయినపల్లి: వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సూచించారు. సిరిసిల్ల -కరీంనగర్ ప్రధాన రహదారిలోని కొదురుపాక ఫోర్‌లేన్ బ్రిడ్జి వద్ద మిడ్ మానేరు వరద ఉధృతిని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ముంపు ప్రాంతాల ప్రజలను అన్నివిధాలా ఆదుకోవాలని అధికారులను కోరారు.

బారికేడ్లు ఏర్పాటు

చందుర్తి: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు పరిశీలించారు. మండలంలోని మూడపల్లి, రామన్నపేట, తిమ్మాపూర్, మల్యాల, జోగాపూర్, ఎన్గల్ గ్రామాల లోలెవల్ కాజ్‌వేలను గురువారం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రమేశ్ పరిశీలించారు. వరద ఉధృతి ఎక్కువగా ఉన్న మూడపల్లి లోలెవల్ కాజ్‌వే వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. శిథిలావస్థలో ఉన్నవారు ఇళ్లను ఖాళీచేసి సురక్షిత ప్రాంతాల్లో వెళ్లాలన్నారు.

ప్రాజెక్టుల వద్దకు వెళ్లొద్దు

ఎల్లారెడ్డిపేట: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్సై రాహుల్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. జలాశయాలు, చెరువులు, వాగుల, ప్రాజెక్టుల వద్దకు ఎవరూ వెళ్లొద్దన్నారు. యువకులు సెల్ఫీలు తీసుకునేందుకు, ఈత కొట్టేందుకు వాగులు, వంకలు వద్దకు వెళ్లకుండా ఉండాలన్నారు.

ఇద్దరికి పదోన్నతి

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న ఆలయంలో గతంలో పర్యవేక్షకులుగా విధులు నిర్వహించిన ఇద్దరు ఉద్యోగులకు దేవాదాయ శాఖ ఏఈవోలుగా ఉద్యోగ పదోన్నతి కల్పించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. గతంలో రాజన్న ఆలయంలో పర్యవేక్షకుడిగా విధులు నిర్వర్తించి ప్రస్తుతం కొండగట్టులో విధులు నిర్వర్తిస్తున్న గుండి హరిహరనాథ్, యాదగిరిగుట్టలో విధులు నిర్వర్తిస్తున్న నాగుల మహేశ్‌కు ఏఈవోలుగా ఉద్యోగ పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు అందజేసినట్లు పేర్కొన్నారు.

డీఈవోకు సన్మానం

సిరిసిల్ల ఎడ్యుకేషన్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఉత్తమ జిల్లా అధికారిగా ప్రశంసాపత్రం అందుకున్న జెడ్పీ సీఈవో, జిల్లా విద్యాధికారి వినోద్‌ను పీఆర్టీయూ నాయకులు సన్మానించారు. స్కూల్ అసిస్టెంట్లు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు నిర్వహించి వారందరికీ నియామక ఉత్తర్వులు అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పీఆర్టీయూ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్, రాష్ట్ర బాధ్యులు చిప్ప యాదగిరి, ప్రభాకర్, జిల్లా బాధ్యులు కామినేని నీలి శ్రీనివాస్,సత్యనారాయణ పాల్గొన్నారు.

వానలోనూ యూరియా కష్టాలు



ముస్తాబాద్: రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. మండలకేంద్రంలో గురువారం తెల్లవారుజామున వర్షంలోనే యూరియా కోసం క్యూలో నిల్చున్నారు. రెండురోజుల క్రితం టోకెన్లు ఇచ్చిన వారికి యూరియా ఇవ్వాలని రైతులు కోరారు. ఎస్సై గణేశ్, పోలీసులతో అక్కడికి చేరుకుని రైతులను శాంతింపచేశారు. ఏవో దుర్గారాజు మాట్లాడుతూ 440 బస్తాల యూరియా మాత్రమే అందుబాటులో ఉందన్నారు. పంపిణీని వాయిదా వేసి, మరుసటి రోజుకు టోకెన్లు పంపిణీ చేశారు.

జక్కుల చెరువులోకి వరదనీరు

ఎల్లారెడ్డిపేట: రాచర్లబొప్పాపూర్ శివారు సింగసముద్రం నుంచి అలుగుదూకి వరదనీరు జక్కుల చెరువులోకి చేరుతోంది. సింగసముద్రం నీటి మట్టం సామర్థ్యం 26 ఫీట్లు కాగా, భారీ వర్షాలతో 21 ఫీట్ల వరకు చేరింది. సింగసముద్రం నీరు వృథాగా పోకుండా నీటిపారుదల శాఖ అధికారులు షట్టర్లను పైకి లేపడంతో వరదనీరు నేరుగా జక్కుల చెరువులోకి వస్తుంది. జక్కుల చెరువు పూర్తిగా నిండితే రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, ఎల్లారెడ్డిపేట కొంత భాగం వరకు సుమారు 300 ఎకరాలకు సాగునీరు అందుతుంది. వరదనీరు వృథాగా వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

బీజేపీ నాయకుల ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట: మత విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల నాయకులు కోరారు. బుధవారం మండలకేంద్రంలోని ఠాణాలో ఫిర్యాదు చేసి మాట్లాడారు. మత ప్రశాంతంగా ఉన్న మండలాన్ని మతం పేరుతో రెచ్చగొడుతున్న షేక్ గౌస్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇక్కడ బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి దాసరి గణేశ్, జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి మనుక కుమార్ యాదవ్, బీజేపీ నాయకులు రంజిత్ కుమార్, మాలోత్ సాయి, కిరణ్ నాయక్, జిల్లా ఐటీ ఇన్‌చార్జి ప్రకాశ్



వేములవాడఅర్బన్ : ఉధృతంగా ప్రవహిస్తున్న వేములవాడ మూలవాగు



వీర్నపల్లి : మద్దిమల్లలో మత్తడి దూకుతున్న రాయిని చెరువు

పోటెత్తిన వరద

బోయినపల్లి/ఇల్లంతకుంట/వేములవాడఅర్బన్/కోనరావుపేట/ముస్తాబాద్/తంగళ్లపల్లి/ఎల్లారెడ్డిపేట/చందుర్తి/వీర్నపల్లి : జిల్లావ్యాప్తంగా బుధ, గురువారాల్లో వర్షం జోరుగా కురిసింది. పలు మండలాల్లో చెరువులు, కుంటలు మత్తడి దూకగా.. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పలు ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇల్లంతకుంట మండలం అనంతారంలో ఒక ఇల్లు, రేపాకలో రెండుఇళ్లు పాక్షికంగా కూలాయి. గాలిపెల్లి ఎస్సీకాలనీలో 25ఇళ్లు లోతట్టు ప్రాంతంలో ఉండడంతో అధికారులు అక్కడివారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇల్లంతకుంట కుమ్మరికుంటలోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. ఎర్రోజు విజయలక్ష్మి ఇంటిలోకి నీరు చేరింది. అనంతారం ప్రాజెక్టు మత్తడి దూకుతోంది. కోనరావుపేట మండలం నిమ్మపల్లిలోని మూలవాగులోకి పూర్తిస్థాయిలో నీరు చేరి మత్తడి దూకుతోంది. వేములవాడ పట్టణం, మండలంలోని గ్రామాల్లో ఒర్రెలు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మూలవాగు ఉధృతంగా పారుతోంది. ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ముస్తాబాద్ మండలంలోని మానేరు వాగు ఉగ్రరూపం దాల్చడంతో రామలక్ష్మణపల్లె, కొండాపూర్, ఆవునూర్, తుర్కపల్లి గ్రామాల్లోని పరివాహక ప్రాంతంలో 150 ఎకరాల్లో వరి నీటి మునిగింది. రామలక్ష్మణపల్లెలో రామాలయం చుట్టూ వరద చేరింది. ముస్తాబాద్ పెద్ద చెరువు మత్తడి దూకుతోంది. రామలక్ష్మణపల్లె, పదిర గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. తంగళ్లపల్లి మండలం కస్బేకట్కూర్‌లో నిర్మించిన చెక్‌డ్యామ్ పైనుంచి వరద కిందకు ప్రవహిస్తోంది. వైకుంఠధామం నీట మునిగింది. గండిలచ్చపేట, కస్బేకట్కూరు, రాళ్లపేట, మండెపల్లి, తంగళ్లపల్లి, తాడూర్, గోపాలరావుపల్లెలో అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. బోయినపల్లి- వేములవాడ దారిలో స్తంభంపల్లి గంజివాగు రోడ్డు తెగిపోయింది. మిడ్‌మానేరులోకి భారీగా వరద చేరుతున్న క్రమంలో ఇంజినీరింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఈఎన్సీ మధుసూదన్‌రావు పేర్కొన్నారు. మిడ్‌మానేరును ఆర్డీఓ రాధాభాయితో కలిసి సందర్శించారు. ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో ఎప్పటికప్పుడు గమనించాలని సిబ్బందికి సూచించారు. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి శివారులోని మానేరువాగుపై ఉన్న వంతెన వద్ద ప్రధాన రహదారి తెగిపోవడంతో సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పదిర వద్ద చిట్టివాగు పొంగి పొర్లుతోంది. కోరుట్లపేట, సింగారం రహదారుల్లో రాకపోకలు నిలిపివేశారు. చందుర్తి మండలంలో వర్షాలకు చెరువులు, కుంటలు నిండుతున్నాయి. మల్యాల వెంగళ చెరువు, మూడపల్లి ఊర చెరువులు నిండి మత్తడి దూకుతున్నాయి,



చందుర్తి : మత్తడి దూకుతున్న మల్యాల వెంగళ చెరువు



ఇల్లంతకుంట : గాలిపెల్లి ఎస్సీకాలనీ నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న అధికారులు



విప్ ఆది శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేశ్ బీగీతే



తంగళ్లపల్లి : నీట మునిగిన కస్బేకట్కూర్ వైకుంఠధామం



కోనరావుపేట: నిమ్మపల్లిలో మత్తడి దూకుతున్న మూలవాగు ప్రాజెక్టు

ఓటరు జాబితా ప్రదర్శన

ముస్తాబాద్: స్థానికసంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాను పంచాయతీ నోటీస్‌బోర్డులో గురువారం ప్రదర్శించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచామని ఎంపీడీవో లచ్చాలు తెలిపారు. అభ్యంతరాలుంటే ఈ నెల 30లోగా సంబంధిత కార్యాలయంలో తెలపాలన్నారు.

కోనరావుపేట: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా లిస్టును అంటించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓటర్ల జాబితాను ప్రదర్శించారు.

ఎల్లారెడ్డిపేట: మండల పరిషత్ కార్యాలయంతో పాటు గ్రామ పంచాయతీలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. ఎంపీడీవో సత్తయ్య మాట్లాడుతూ.. మండలంలో ఓటర్ల జాబితాను వార్డుల వారీగా ప్రచురించినట్లు తెలిపారు. సవరణలు, అభ్యంతరాలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈనెల 30 వరకు తమ అభ్యంతరాలను తెలపాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో ప్రవీణ్‌కుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.



కోనరావుపేటలో ఓటర్ల లిస్టును అతికిస్తున్న అధికారులు



సిరిసిల్ల అర్బన్ : సిరిసిల్లలో గణనాథుడిని మండపానికి తరలిస్తున్న నిర్వాహకులు

ఊరూవాడా.. గణనాథులు

సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో బుధవారం ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో వినాయక విగ్రహాలను నెలకొల్పారు. ఆటపాటలు, నృత్యాలు చేస్తూ వినాయకులను మండపాల వద్దకు తీసుకువచ్చి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. గణేశ్ నవరాత్రులను భక్తులు అంగరంగ వైభవంగా ప్రారంభించారు. విభిన్న ఆకృతుల్లోని గణేశ్ ప్రతిమలు పలువురిని ఆకట్టుకున్నాయి. భారీ వర్షాలను సైతం భక్తులు లెక్కచేయలేదు, గణేశ్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పోలీసులు మండపాల నిర్వాహకులకు సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్



తంగళ్లపల్లిలో 18 అడుగుల వినాయకుడు



వేములవాడ : రాజన్న ఆలయంలో వినాయకుడి వద్ద పూజలు చేస్తున్న అర్చకులు



బోయినపల్లిలో గణపతులను మండపాలకు తరలిస్తున్న నిర్వాహకులు



రుద్రంగిలో..



ముస్తాబాద్‌లో పూజలు చేస్తున్న భక్తులు



కోనరావుపేటలో ..



వేములవాడ అర్బన్ : తిప్పాపూర్‌లో హనుమాన్ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడు



ఇల్లంతకుంట : అర్యన్ యూత్ ఆధ్వర్యంలో..

'సెల్ఫీ విత్ మట్టి గణపతి'కి స్పందన

వినాయక చవితి సందర్భంగా సాక్షి 'సెల్ఫీ విత్ మట్టి గణపతి'కి స్పందన లభించింది. పలువురు మట్టి గణపతులను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. మట్టి గణపతులతో సెల్ఫీ దిగి భక్తిభావం చాటుకున్నారు. ప్రతీ ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులను పూజించాలని చాటి చెప్పారు.



మామిడి సుప్రజారెడ్డి, కొండాపూర్, సిరిసిల్ల



అక్షర, వేములవాడ



శ్రేయాన్షి, కనగర్తి, కోనరావుపేట



బుట్టం వేణుపటేల్, మెహర్‌నగర్ సిరిసిల్ల



హిమాన్షి చిల్డ్రన్ హాస్పిటల్, సిరిసిల్ల



అమృత్ యాదవ్, వేములవాడ



కోనరావుపేట మండలం కనగర్తిలో..



నందన్‌సాయి మెహర్‌నగర్, సిరిసిల్ల

రాజన్నా శరణు.. శరణు

వేములవాడ/వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్నను బుధవారం స్థానిక భక్తులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వారు దర్శించుకున్నారు. వినాయక చవితి సెలవు దినం, ఏకదంతుడిని దర్శించుకోవాలని భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజన్నను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విప్ ఆది శ్రీనివాస్ వేర్వేరుగా దర్శించుకున్నారు. అడ్లూరి స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి కల్యాణ మండపంలో వేద పండితులు, ఆలయ అర్చకులు మంత్రికి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఆలయ ఈవో రాధాబాయి మంత్రికి స్వామివారి ప్రసాదం అందజేశారు. రాజన్న సన్నిధిలో గణేశ్ నవరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నాగిరెడ్డి మంటపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంటపంలో స్వామివారిని ప్రతిష్ఠించారు. ఆలయంలోని మూలవి రాట్టు స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఏకాదశి, ద్వాదశి రోజున శ్రీలక్ష్మీగణపతి దేవుడికి ప్రత్యేక పూజలు, హవనం, మహాపూజ నిర్వహిస్తున్నట్లు అర్చకులు రాజేశ్వర శర్మ తెలిపారు. వచ్చేనెల 4న ఊరేగింపు నిర్వహించిన అనంతరం ధర్మగుండంలో నిమజ్జనం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రాజన్నను ఎస్పీ మహేశ్ బిగితే గురువారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.



రాజన్నకు కోడె మొక్కులు చెల్లిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

సంక్షిప్త వార్తలు

● రుణాల చెక్కుల పంపిణీ

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట ప్యాక్స్ పరిధిలోని సొసైటీ సభ్యులకు ఎనిమిది మందికి దీర్ఘకాలిక రుణాల కింద రూ.32 లక్షల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు ప్యాక్స్ చైర్మన్ రొడ్ల తిరుపతిరెడ్డి తెలిపారు. కర్షక మిత్ర దీర్ఘకాలిక రుణాల కింద రూ.25 లక్షలు ఐదుగురు సభ్యులకు అందజేసినట్లు, గొర్ల కొనుగోలు కోసం ముగ్గురికి రూ.7లక్షల చెక్కులు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు గజ్జల సత్యం, చల్ల నవీన్ రెడ్డి ,సొసైటీ కార్యదర్శి రవీందర్ రెడ్డి, మధుకర్ రెడ్డి, జి రవీందర్, లబ్ధిదారులు, పాల్గొన్నారు.

● చెరువుల పరిశీలన

వీర్నపల్లి: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు, రైతులు జాగ్రత్తగా ఉండాలని తహసీల్దార్ ముకర్ పాషా, ఎస్సై వేముల లక్ష్మణ్ అన్నారు. మండలంలోని వాగులు, చెరువులను పరిశీలించారు. మద్దిమల్ల రాయిని చెరువు వద్ద వాగును పరిశీలించారు. రైతులు పొలాలు, విద్యుత్ స్తంభాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మద్దిమల్ల లొద్ది తండాకు చెందిన అంగోత్ కవిత అనే గర్భిణిని వర్షం కారణంగా ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ఇబ్బంది పడుతుండగా తహసీల్దార్, ఎంపీడీవో బీరయ్య, ఆర్ఐ శివకుమార్ 108లో జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు.

● వ్యాన్ బోల్తా

రుద్రంగి: గైదిగుట్ట తండా ఘాట్ రోడ్ మూలమలుపు వద్ద గురువారం టమాటాల లోడుతో వెళ్తున్న వ్యాన్ బోల్తాపడి డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మహారాష్ట్ర నుంచి బీంగల్, మానాల మీదుగా సిరిసిల్లకు వెళ్తున్న వ్యాన్ గైదిగుట్ట తండా ఘాట్ రోడ్డు మూలమలుపు వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి.

● వరదనీటిలో కొట్టుకుపోయిన కొండచిలువ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అగ్రహారం శివారులోని వంతెన కింద నుంచి ప్రవహిస్తున్న వరదనీటిలో కొండచిలువ కొట్టుకుపోయింది. సమీపంలో ఉన్న రైతులు వరదనీటిలో కొండచిలువ కొట్టుకుపోవడం చూసి అధికారులకు సమాచారం అందించారు. అధికారులు అక్కడికి చేరుకునేలోపే కొండచిలువ వరదనీటిలో కొట్టుకుపోయింది.

● హత్యకేసులో ఒకరికి జీవిత ఖైదు

సిరిసిల్లకల్చరల్: ఒకరిని హత్య చేసిన కేసులో జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ గురువారం తీర్పు వెల్లడించారు. ఎస్పీ మహేశ్ బి గితే వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలం కొండాపూర్‌కు చెందిన సిద్రం మహేశ్ వేములవాడలో కూలీపని చేసుకుని జీవించేవాడు. దద్ర తిరుపతితో ఏర్పడిన పరిచయంతో అతన్ని తన గదిలోనే ఉంచుకున్నాడు. మద్యానికి బానిసైన తిరుపతి అద్దె ఇవ్వకుండా మహేశ్‌ను వేధించేవాడు. తాగకుండా ఉంటేనే గదిలో ఉండాలంటూ మహేశ్ గట్టిగా మందలించడంతో అందరిముందు తన పరువు తీశావంటూ తిరుపతి కక్ష పెంచుకున్నాడు. 2024 ఏప్రిల్ 1న తనను అవమానించాడనే కోపంతో నిద్రిస్తున్న రమేశ్‌పై పెద్ద సిమెంట్ రాయితో మోది చంపాడు. మహేశ్ భార్య పద్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన వేములవాడ పోలీసులు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. పీపీ పెంట శ్రీనివాస్ కేసు వాదించగా కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి 17 మంది సాక్ష్యాల ఆధారంగా నిందితుడు తిరుపతికి జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

● దొంగతనం కేసులో మూడేళ్ల జైలు

సిరిసిల్లకల్చరల్: పాన్‌షాప్‌లో దొంగతనం చేసిన ఓ వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పునిచ్చారు. సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ వెల్లడించిన వివరాల ప్రకారం సర్దార్‌నగర్‌కు చెందిన కీసర రాహుల్ శివనగర్‌లో సీతారామ మెస్ ఎదుట పాన్‌షాప్ నడుపుతుండే వాడు. 2025 ఏప్రిల్ 22న ఎప్పటిలాగే రాత్రి 11గంటలకు షాప్ మూసేసి తెల్లవారి వెళ్లి చూడగా చోరీ జరిగిన విషయం గుర్తించాడు. సుమారు రూ.19,665ల విలువైన సామగ్రి చోరీ అయినట్లు గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు బీవైనగర్‌కు చెందిన గెంట్యాల హరీశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసిన అనంతరం విచారణలో ఆరుగురు వ్యక్తుల సాక్ష్యాలను ఆధారం చేసుకుని నిందితుడి నేరం నిర్ధారణ అయినట్లు ధృవీకరించారు. దీంతో హరీష్‌కు మూడేళ్ల జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

● విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

వీర్నపల్లి: విద్యుత్‌షాక్‌తో గేదే మృతిచెందింది. మండలంలోని భూక్యతండాకు చెందిన గుగులోతు సక్కుకు చెందిన గేదె మంగళవారం రాశిగుట్ట తండాలోని పోచమ్మ టెంపుల్‌వద్ద విద్యుదాఘాతంతో మృతిచెందింది. రూ.60 వేలవిలువైన గేదె మృతిచెందిందని, నష్టపరిహారం చెల్లించాలని ఆమె కోరుతుంది.